**సంపాదకీయం**

# పెద్దల సండేస్కూల్

క్రీస్తునందు అనుదిన పరిశుద్ధ లేఖన ప్రకాశం పాఠకులందరికి ఆయన దివ్య నామమున శుభములు.

ఈ మాసంలో వేసవి బైబిలు పాఠశాలలను (V.B.S.) ప్రతి సంఘం పిల్లల కొరకు నిర్వహిస్తారు. అయితే ఈ పాఠశాల సంఘంలో ఉన్న అన్ని వయస్సుల వారికి ఎందుకు ఏర్పాటు చేయకూడదు? సంఘంలో వయస్సుతో సంబంధం లేకుండా అందరికి దేవుని గూర్చిన జ్ఞానము ఎంతో అవసరము. దేవుని యెదుట యోగ్యులుగా సత్యవాక్యమును సరిగా ఉపదేశించువారిగా, అంటే సత్య వాక్యమును సరిగా తమ జీవితాలలో ఉపయోగించేవారిగా కనబడడానికి ప్రతి ఒక్కరూ జాగ్రత్త పడాలి (2 తిమో. 2:15).

ఒకరోజు అందరం తీర్పులో నిలబడాల్సిందే ! దేవునిచే భళా నమ్మకమైన మంచి దాసులం, దాసురాళ్ళం అనిపించుకోవాలంటే యేసు పిలుపు విని, ఆయన కాడి మన మీద ఎత్తుకొని, ఆయన దగ్గర నేర్చుకోవాలి (మత్త 11:28,29). మానవుడిగా ఈ లోకానికి వచ్చినప్పుడు ప్రతి ఒక్కటి ఆయన తండ్రి దగ్గర నేర్చుకొని తరువాతే చేసేవాడు. మొదట శ్రమల డిపార్టుమెంటులో విధేయత పట్టాను సంపాదించాడు (హెబ్రీ 5:8). తండ్రి క్లాసులో నేర్చుకొని దివ్య బోధకుడు అన్న పేరును సంపాదించాడు (యోహాను 8:28). మనం జీవితంలో అనేక రంగాలలో నేర్చుకోవడానికి ప్రయత్నిస్తాం కాని ఆధ్యాత్మిక రంగం వచ్చేసరికి అన్ని వచ్చునుకుంటాం లేదా నేర్చుకోనవసరం లేదనుకుంటాం. కాని అందరికి యేసు ప్రభువు ఆజ్ఞ ఏమనగా ఆయన కాడి ఎత్తుకొని ఆయన దగ్గర నేర్చుకొనుట (మత్త. 11:28-29). మరి మీరు ఆయన కాడిని ఎత్తుకున్నారా? ఆయన యొద్ద నేర్చుకుంటున్నారా? ఆయన వాక్యం నేర్పించుట మరియు ప్రతి వారిని పరిచర్య కొరకు సిద్ధపరచుట ప్రతి సేవకుని గురుతర బాధ్యత. సంఘం యొక్క అతి ముఖ్యమైన బాధ్యత కూడా ఇదే సుమా! సమస్త విధములైన జ్ఞానముతో క్రీస్తు వాక్యం మీలో సమృద్ధిగా నివసింపనీయుడి అంటాడు పౌలు (కొలస్సీ 3:16). కాని విచారకరమైన విషయమేమంటే సంఘాలలో బైబిలు నిరక్షరాస్యత ఉన్నది. ఇది నిర్మూలం అగుటకు ఆదివారం ప్రసంగాలు చాలవు. ప్రతి ఒక్కరికి బైబిలు ప్రాథమిక సత్యాలను నేర్పించడమే మార్గం. అంటే సంఘంలో మొదట పెద్దల ఆదివారపు పాఠశాల (Adults Sunday School) ప్రారంభించాలి. దీనికొరకు ముందు కొంతమంది ఉపాధ్యాయులుగా ఉండడానికి తమను తాము దేవునికి సమర్పించుకోవాలి. ప్రతివారు ఆదివారం ఆరాధనకు వస్తారు కనుక ఆరాధనకు ముందు గాని ఆరాధన తరువాత గాని ఒక గంటసేపు ఈ తరగతులు తెరవబడి ఉండాలి. ఆ మేరకు సంఘంలో ప్రకటన చేసి ఏ వయస్సు వారు ఆ వయస్సు క్లాసులకు హాజరు కమ్మని ఆహ్వానించాలి. అనుభవజ్ఞులయిన సేవకులు సిద్ధపరచిన సిలబస్‌ను సంపాదించి ప్రార్థనాపూర్వకంగా బోధించాలి.

అనుదిన పరిశుద్ధ లేఖన ప్రకాశం సంపాదక వర్గం ఈ సిలబస్‌ను ప్రార్థనాపూర్వకంగా సిద్ధపరుస్తుంది. దీనిని గురించి ప్రతి సంఘానికి సండే స్కూల్ సూపరింటెండెంట్ ఎలా ఉండాలో అదే విధంగా సంఘంలో పెద్దల బైబిలు పాఠశాల నడిపించుటకు ఒకరు సమర్పించుకొని సిద్ధపడాలి. ఈ పాఠశాలలను సంఘాలలో తెరచి బోధించుటకు ఉపాధ్యాయులకు తర్ఫీదు ఇచ్చుటకు **"అనుదిన పరిశుద్ధ లేఖన ప్రకాశం"** సంపాదక వర్గం సిద్ధంగా ఉంది. మీ సంఘాలకు వచ్చి మీకు తర్ఫీదు ఇస్తాం. దీనిని గురించి ప్రార్థించండి. వెంటనే మీ సంఘాలలో పెద్దల బైబిలు సండే స్కూలులను ప్రారంభించండి. మరిన్ని వివరాలకు మమ్ములను సంప్రదించండి.

**ఫోన్ నెం. : 9391366670, 9848340922, 9848349155.**

**E-mail : jpethakoti@gmail.com.**

**దేవుడు మిమ్ములను దీవించు గాక !**

*- ఈతకోటి జ్యోతిప్రకాష్*

6-04-08

## పునరుత్థానుడైన క్రీస్తునందు జీవితం
**(యెహె. 37:1-14, రోమా 6:1-14, యోహా 21:1-14)**

**స్తుతి ఆరాధన : కీర్తన 23**

దేవునికి మీకు ఉన్న సంబంధం యేమిటి? ఆయనను నా కాపరి అని పిలవాలంటే, వీరు ఆయన గొఱ్ఱెలవ్వాలి (యోహాను 10:27-29). అంటే ఆయన మాట వినాలి. దేవుడు మన మంచి కాపరి. మన ప్రధాన కాపరి. మన ఆత్మల కాపరి. ఆయన గొఱ్ఱెలుగా ఆయనను ఈ లోకంలో వెంబడించుటయే ఆరాధనంటే. అలా ఆయనను వెంబడించు వారందరికి ఈ కీర్తనలో ఉన్న వాగ్దానాలు వర్తిస్తాయి.

**సందేశము**

పునరుత్థానమును జీవము యేసుప్రభువే. ఆయన యందు విశ్వాసముంచిన యెడల అపరాధముల చేతను పాపముల చేతను చచ్చినవారైనప్పటికి తిరిగి బ్రతుకుతారు. అలా బ్రతికినవారు మరెన్నటికి చనిపోరు. (యోహాను 11:2;20, ఎఫెసి 2:1). క్రైస్తవ జీవితమంటే క్రీస్తుతో కూడా సిలువ వేయబడి మరణించి, బాప్తిస్మమునందు పాతి పెట్టబడి, క్రీస్తుతో కూడ తిరిగి లేచి, పునరుత్థానుడైన క్రీస్తునందలి విశ్వాసము ద్వారా జీవించడం. ఆయన జీవించుచున్నాడు. గనుక మనమును జీవించుచున్నాము (యెహా 14:19). ఏ బేధం లేదు అందరు పాపం చేసారు అని వాక్యము చెబుతుంది. అలా పాపం చేసిన అందరు చచ్చినవారే. చచ్చిన శవాన్ని అలా వదిలేస్తే ఏమవుతుంది? ఎండిన ఎముకలవుతాయి. అంటే ఇప్పుడు లోకం ఎలా వుందంటే పాత నిబంధన పాఠంలోని ఎండిన ఎమకలతో నిండియున్న లోయలా ఉంది. అలాంటి లోయలోనికి యెహోవా దేవుడు యెహెజ్కేలును ఏ విధంగా పంపించాడో అదే విధంగా యేసును ఈ లోకంలోనికి తన వాక్కుగా పంపించాడు. ఈ యేసే జీవవాక్యము. ఆయన మాటలే జీవింపజేయు నిత్యజీవపు మాటలు. పాతనిబంధన పాఠంలో ఏ విధంగా ఎండిన ఎముకలు, జీవము పొంది, యెహోవా సైన్యమయ్యారో అదే విధంగా క్రీస్తుతో కూడా తిరిగి లేచినవారందరు నూతన జీవము పొంది నడుచుకోవాలి అని పత్రికపాఠం బోధించుచున్నది. సువార్త పాఠం క్రీస్తు జీవము పొందిన ప్రతివారు ఎల్లప్పుడు ఆయన వాక్యమునకు విధేయులై, మనుష్యులు పట్టు జాలరులుగా జీవించాలి అని తెలియజేయుచున్నది. అదే వాస్తవమైన క్రైస్తవ జీవితం. అలా జీవించమని ఈ రోజు దేవుడు మనలను కోరుతున్నారు.

**పాత నిబంధన పాఠం: యెహెజ్కే 37:1-14;**
**చచ్చినవారిని బ్రతికించునది దేవుని వాక్యమే.**

బబులోను చెరలో ఉన్న ఇశ్రాయేలు వారిని గురించి తన సేవకుడైన యెహెజ్కేలుకు దర్శనంలో తాను చేయబోవు సంగతిని యెహోవా దేవుడు బయలుపరచుచున్నాడు. లెక్కలేనన్ని సార్లు తన ప్రజలు తనపై తిరుగబడి నిబంధనను మీరినప్పటికి వారికి మేలు చేయాలని దేవుడు ఎప్పుడు ఆలోచిస్తూనే యున్నాడు. కరుణాసంపన్నుడు గనుక ఆయన మానవాళిని క్షమించుచునే ఉన్నాడు. బహుశా ఆ రాత్రి యెహెజ్కేలు, ఇశ్రాయేలు వారు తను ఎంత బోధించినా తన మాట వినక పోవుట వలన తను చచ్చిన వారితో మాట్లాడుతున్నానా అని అనుకుంటూ పండుకున్నాడేమో. ఎండిన ఎముకలు యూదా చెరను సూచిస్తాయి. దాస్యమను సమాధులలో ఉన్న ఇశ్రాయేలును తిరిగి లేపుతానని, తన సేవకునికి దేవుడు తెలియజేయు చున్నాడు. ఎండిన ఎముకలు మానవుని ఆధ్యాత్మిక స్థితిని కూడా సూచిస్తాయి. నిజమే ఒక విధంగా నేటి సంఘాలు ఆసక్తి లేని ఎండిన ఎముకల గుట్టలుగా ఉన్నాయి. అయితే దేవుడు సంఘాలను ఉజ్జీవింపజేయుటకు యెహెజ్కేలు వలే తన సేవకులను పంపిస్తూనే ఉన్నాడు. కనుక ఇప్పుడు మీ సంఘం చచ్చిన సంఘంవలె మీకనిపిస్తే నిరుత్సాహపడవద్దు. ఎందుచేతనంటే, దేవుడు లోబడనొల్లని తన ప్రజలవైపు దినమంతా చేతులుచాచి పిలుస్తూనే ఉన్నాడు. చచ్చిన సంఘాలను తిరిగి పునరుజ్జీవింప జేయుటకు నిరంతరం పని చేస్తూనే ఉన్నాడు. ఆయనతో కలిసి మనలను పనిచేయమంటున్నాడు. ఆయన పిలుపు విన్న వారిని తన శక్తితో నింపుతానంటున్నాడు. ఎండిన ఎముకల గుట్టలవలే ఉన్న సంఘాలు, శత్రువైన సాతాను నోడించే మహా సైన్యాలవలె అవ్వాలంటే కాపరులు యెహెజ్కేలు వలే దేవుని మాట వింటూ రక్షణ జ్ఞానమునిచ్చు శక్తిగల దేవుని వాక్యమును సకల విధములైన జ్ఞానములో ప్రకటించాలి, బోధించాలి. అపరాధములచే తమ పాపములచేతను చచ్చిన సరే ఏ విధంగా ఆయన శక్తిని ప్రతివారు పొందగలమో నేటి పత్రిక పాఠం తెలియజేయుచున్నది.

**పత్రిక పాఠం: రోమా 6:1-14; బాప్తిస్మం క్రీస్తు తోటి ఐక్యానుభవం**

కొన్ని శాఖలవారు చిన్నప్పుడే బాప్తిస్మం తీసుకోవాలంటారు. మరికొందరు మారుమనస్సు పొందాక తీసుకోవాలంటారు. బాప్తిస్మం ఇచ్చేటప్పుడు కూడా కొంతమంది నీళ్ళుచిలకరిస్తారు. మరికొందరు నీళ్ళలో పూర్తిగా ముంచుతారు. "బాప్టిజో" అనే గ్రీకు పదం నుండి "బాప్టిసమ్" అనే ఆంగ్ల పదం వచ్చింది. దీని నుండి మనం వాడు బాప్తిస్మం వచ్చింది. మూల భాష గ్రీకులో "బాప్టో" అనగా "ముంచుట". ప్రొటస్టెంటు వారు ఆచరించు కర్మ కాండలు" (Sacraments) రెండు. అందులో మొదటిది బాప్తిస్మం. రెండవది ప్రభు రాత్రి భోజనం. అంతరంగంలో జరిగిన మార్పుకు ఇవి గుర్తులు అని గ్రహించాలి. బాప్తిస్మాన్ని అంతరంగంలో జరిగిన మార్పుకు

బహిరంగ సాక్ష్యం అని కూడా అంటారు. అయితే మనలను పరలోకం తీసుకువెళ్లేది బాప్తిస్మం కాదు. ఒకరు పరలోకం వెళ్ళాలంటే మానవాళి పట్ల దేవుని చిత్తమైన రక్షణను పొందాలి (మత్త 7:21, 1 తిమోతి 2:4). రోమా 6వ అధ్యాయం బాప్తిస్మ అనుభవం యొక్క ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను ఎంతో తేటగా వివరిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే బాప్తిస్మం క్రీస్తుతోటి ఐక్యానుభవం. ఏ రోజైతే మనం మన పాపములను మనం ఒప్పుకొని, ఆయనను మన రక్షకుడిగా స్వీకరిస్తామో ఆ రోజు మనం క్రీస్తుతో కూడా సిలువ వేయబడి మరణిస్తాము. దీనినే పౌలు క్రీస్తుతో కూడా సిలువ వేయబడుట అని అంటాడు. దీనినే ఈ అధ్యాయంలో ఆయన మరణములోనికి మీరు బాప్తిస్మం పొందుట అని తెలుసుకొండి అంటున్నాడు పౌలు. బాప్తిస్మం తీసుకొనుటకు నీళ్ళలోనికి వెళ్ళినపుడు ఆయనతో, కూడా పాతి పెట్టబడ్డాం అంటాడు (4వ). ఈ విధంగా మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యము గలవారమై, నీళ్ళలోనుండి బయటికి వచ్చునపుడు ఆయన పునరుత్థాన సాదృశ్యమందు ఐక్యము గలవారమవుతాం. ఈ విధంగా పాప విముక్తులమయ్యాం అని గ్రహించాలి. ఎందుకంటే చనిపోయినవాడు పాప విముక్తుడని తీర్పు నొందుతాడు అని పౌలు తెలియజేస్తున్నాడు (7వ).

ఇట్లు బాప్తిస్మం అనుభవంలో మనం అందరం ఆయనతో కూడా చనిపోయి ఇక ఎన్నటి చనిపోకుండుడటకు ఆయనతో తిరిగి లేస్తాం. ఆయనతో కూడా నిత్యం జీవిస్తాం. ఇదే మన విశ్వాసం. ఒకప్పుడు సాతాను బానిసలమైన మనం, యేసును అంగీకరించుట ద్వారా ఆయనతో సిలువ వేయబడిన అనుభవంలో, మన ప్రాచీన స్వభావం సిలువ వేయబడింది అని గ్రహించాలి. క్రీస్తు మృతులలో నుండి ఏలాగు లేపబడెనో, అలాగే మనము నూతన జీవము పొందినవారమై నడుచుకొనుటకు మనం కూడా తిరిగి లేస్తాం. కనుక క్రీస్తు దేవుని విషయమై జీవించుచున్నట్లు మనం కూడా జీవించాలి. అదేలా సాధ్యం అవుతుందంటే పాపము విషయములో మృతులుగాను, దేవుని విషయమై క్రీస్తుయేసునందు సజీవులుగా మనలను మనమే ఎంచుకోవాలి (11వ). 11వ వచనం ఈ అధ్యాయానికి కీలక వచనం.

కనుక మనం చిలకరింపు బాప్తిస్మము తీసుకున్నామా, ముంచడం బాప్తిస్మం తీసుకున్నామా, అనునది ముఖ్యం కాదు. శరీర దురాశలకు లోబడునట్లు చావునకు లోనైన మీ శరీరమందు ఇంకా పాపమును ఏలనిస్తున్నామా? మన అవయవములను దుర్నీతి సాధనములుగా ఇంకా అప్పగించుకొంటున్నామా? లేదా మృతులలో నుండి సజీవులమనుకొంటూ మన అవయవములను నీతి సాధనములుగా అప్పగించుకుంటున్నామా? అది ముఖ్యమైనది.

మీరు నిజంగా క్రీస్తుతో కూడా లేపబడిన వారైతే పైనున్న వాటినే వెదుకుతున్నారా? లేదా? మిమ్మును మీరే పరీక్షించుకోండి (కొలస్సీ 3:1). ఇక మనమీద పాపం యొక్క ప్రభావం ఉండకూడదు. మనం దేవుని విషయమై జీవించాలి. అందుకు ఒకప్పుడు సాతాను బానిసలమైన మనం ఇప్పుడు దేవుని బానిసలమవ్వాలి. అప్పుడు పరిశుద్ధత అను పంట కోస్తాం. నిత్య రాజ్యంలో ప్రవేశిస్తాం. రోమా 6:22 కంఠత చేయండి. ఎందుకంటే, అతి సూక్ష్మంగా క్రైస్తవ్యాన్ని వర్ణించే వచనం ఇది. ఈ విధంగా క్రీస్తుతో లేపబడినవారు, పేతురు, పౌలు వలే మనుష్యులు పట్టు జాలరులు కావాలి. క్రీస్తునందు జీవించడం అంటే ఇదే. అదే నేటి సువార్త పాఠం.

## సువార్త పాఠం: యోహాను 21:1-14;
## క్రీస్తు మనలను మనుష్యుల పట్టు జాలరులుగా చేస్తాడు

ప్రభువైన యేసు మరణం, పేతురును నిరాశ చీకటిలోనికి తీసుకు వెళ్ళింది. మరిముఖ్యంగా మూడుసార్లు ప్రభువును ఎరుగునన్నినే అన్న బాధ పేతురును బాగా కృంగదీసి ఉండవచ్చు. ప్రభువు చెప్పిన మాటలేవి పేతురుకు ఆ సమయంలో గుర్తుకు రాలేదు. "పేతురూ నిజమే సాతాను మిమ్ములను పట్టి గోధుమలవలే జల్లించేస్తుంది. అయినా నీ విశ్వాసం చెదరకుండునట్లు నేను నీ కొరకు ప్రార్థన చేస్తాను. గనుక నీవు నీ సహోదరులను స్థిరపరచాలి" (లూకా 22:31) అన్న ప్రభువు మాటలు మరచిపోయి, మళ్ళీ పేతురు తన సహోదరులందర్ని చేపలు పట్టటానికి సముద్రంలోనికి తీసుకువెళ్ళాడు.

అయితే తాను ఎన్నుకొన్న పేతురును తిరిగి పునరుజ్జీవింపజేసి పని కొరకు సిద్ధపరచుటకు ప్రభువు పేతురుకు దర్శనమిచ్చాడు, ఆదరించాడు, ప్రోత్సహించాడు. మళ్ళీ పనికి పంపించాడు. అక్కడనుండి పేతురు ఇక వెనుదిరగలేదు. పిరికి పేతురు, దుడుకు పేతురు, ఇప్పుడు సంఘానికి బండ అయ్యాడు. సంఘ నిర్మాణకుడయ్యాడు. ధైర్యశాలియై ప్రభువు పునరుత్థానమును ప్రకటించాడు. సంఘం స్థాపించబడినప్పుడే గొప్ప నాయకుడుగా సంఘాన్ని నడిపించాడు. చివరికి ప్రభువు కొరకు హతసాక్షి అయ్యాడు. పేతురు తనను సిలువ వేయువారితో, నేను నా ప్రభువువలే సిలువ వేయబడుటకు తగను, నన్ను తలక్రిందులుగా సిలువ వేయండి అన్నాడట". ఈ విధంగా ప్రభువు కొరకు తన ప్రాణాలర్పించి రక్షణ చరిత్రలో ప్రజ్వరిల్లే నక్షత్రమయినాడు. తన రెండు పత్రికలద్వారా మనలను అన్నిటిలో క్రీస్తు ద్వారా దేవుడు మహిమపరచబడునట్లుగా జీవించమంటున్నాడు. అదే పునరుత్థానుడైన క్రీస్తులో జీవించడం అంటే ! దేవుడు మిమ్ములను దీవించు గాక !

### జీవితానికి అన్వయం - ఈ వార ధ్యాన సూచనలు

**సోమవారం :** తీతు 3:1-11 ధ్యానించండి. ఇక్కడ 5వ వచనంలో గల "పునర్జన్మ సంబంధమైన స్నానము"ను బాప్తిస్మంగా పరిగణించవచ్చు. దేవుడు మనలేలా రక్షించాడు? ఎందుకు రక్షించాడు?

**మంగళవారం :** 1 కొరింథీ 12:12-31 ధ్యానించండి. ఇక్కడ 13వ వచనంలో పౌలు ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మ యందే

బాప్తిస్మము, పొందితిమి అంటాడు. అంటే బాప్తిస్మం ద్వారా క్రీస్తు శరీరమైన సంఘంలో అవయవములమవుతామన్నమాట ! అవయవములన్నివాటి వాటి పని సక్రమంగా చేస్తే సంఘమనే శరీరం బలంగా ఉంటుంది. ప్రభువు పని చేయగలదు. కాని చాలమంది పైకి భక్తిగా కనిపిస్తున్నారు. దేవుని శక్తిని ఆశ్రయించడంలేదు.

**బుధవారం :** కొలస్సీ 2:8-15 ధ్యానించండి. ఈ భాగంలో బాప్తిస్మం గురించి పౌలు ఏం చెబుతున్నాడు.

**గురువారం :** కొలస్సీ 3:1-3 ధ్యానించండి. మీరు క్రీస్తుతో కూడా లేపబడియున్నారా? లేపబడి ఉంటే మీరు ఏమి చేయాలి. ఆ పని చేస్తున్నారా?

**శుక్రవారం :** రోమా 6:1-10 మళ్ళీ ధ్యానించండి. “మీరెరుగరా”? (3), “యెరుగుదము” (8) “ ఎరిగి” (9) అనుటలో పౌలు ఉద్దేశమేమంటే అందరు ఈ సత్యాలను బాగా గ్రహించాలని, కనుక బాప్తిస్మం అంటే ఏమిటో మీరు తెలుసుకొని రోజు మీ పిల్లలకు నేర్పించండి.

**శనివారం :** రోమా 6:11-23 ధ్యానించండి. ఈ అధ్యాయంలోని కీలక వచనం 11వ వచనం బాప్తిస్మం అంటే అక్షరానుసారమైన భావం మునుగుట, దృష్టాంతపరమైన భావం ఏకమగుట” (to be identified with). బాప్తిస్మం ద్వారా మనం క్రీస్తులో ఏకమయ్యామన్న సత్యాన్ని ఈ అధ్యాయం ద్వారా పౌలు అందరిని తెలుసుకోమంటున్నాడు. రోమా గ్రంథంపై ఉన్న వ్యాఖ్యానాలను సంప్రదించి, ఇంకా సత్యాలను తెలుసుకోవడానికి ప్రయత్నించండి.

13-04-08

## లోకానికి వెలుగైన యేసు - వెలుగులో నడుచుకొనుట

**(యెష 60:1-7, కీర్తన 77, ఎఫెసి 5:8-21, లూకా 24:13-35)**

**స్తుతి ఆరాధన : కీర్తన 527**

దేవుడు వెలుగై యున్నాడు. ఆయనయందు చీకటి ఏ మాత్రము లేదు. ఆయన మనలను చేసినప్పుడు ఆయన స్వరూపంలో చేసాడు. అనగా వెలుగుగా చేసాడు. నరుని ఆత్మ యెహోవా పెట్టిన దీపం. (సామి 20:27). అయితే పాపం చేయుట వలన ఆత్మ దీపం ఆరిపోయింది. ఆరిపోయిన ఆత్మ దీపాలను వెలిగించుటకు యేసుప్రభువు నిజమైన వెలుగుగా ఈ లోకంలోనికి వచ్చాడు. అందుకే దేవుడు మన వెలుగు. మన రక్షణ అంటాడు కీర్తనకారుడు. రక్షణ పొందకుండా దేవుని ఆరాధించలేము. చచ్చిన వారు ఏం చేయలేరు కదా?కనుక దేవుని సమీపించదలచిన ప్రతివారు, క్రీస్తు రక్తము ద్వారానే సమీపించాలి. అంతేగాని కయీను వలే ఆరాధిస్తే, దేవుడు సంతోషించడు. చాలమంది దేవుడు కావాలని కోరుకోవడం లేదు కీర్తనకారునివలే.

**సందేశము**

సూర్యుడుదయించినప్పటికి, నిద్రపోతున్న వారందరు ఇంకా చీకటిలో ఉన్నట్లే. అదేవిధంగా నీతిసూర్యుడైన క్రీస్తు ఉదయించినప్పటికి, ఆయన వెలుగులోనికి రానివారందరు చీకటిలో నిద్రపోతున్నట్లే. యేసు ప్రభువు ఈ లోకానికి వచ్చినప్పుడు ఆయన నిజమైన వెలుగుగా వచ్చారు. ఆ వెలుగు మనుష్యులకు జీవమైంది. ఈ నిజమైన వెలుగు లోకంలోనికి వచ్చుచు ప్రతి మనుష్యుని వెలిగించుచున్నది అన్నాడు యోహాను (1:9). యేసు ప్రభువు నరావతారిగా ఈ లోకంలో సంచరించినపుడు ఎక్కడి వెళితే అక్కడ మరణపు చీకటిలో ఉన్నవారు జీవపు వెలుగు చూశారు అని మత్తయి తన సువార్తలో పేర్కొన్నాడు (మత్త 4:12-18). అంతేకాదు యేసు నేను లోకానికి వెలుగు అని తనను గురించి తాను తెలియజేసుకున్నారు (8:12, 9:5). దేవుడు వెలుగై యున్నాడు గనుక యేసు దేవుడు అని తన సువార్తలో యోహాను తెలియజేసాడు.

ఆదియందు దేవుడు భూమ్యాకాశములను, శూన్యముగా నిరాకారముగా చేయలేదు (ఆది 1:1, యెష 45:18). అయితే ఆదికాండం 1:2లో ఈ భూమి నిరాకారంగాను శూన్యంగాను, అంధకారమయం అవడానికి కారణం సాతానే అవ్వచ్చు అని కొంతమంది దైవజ్ఞాన పండితుల అభిప్రాయం. ఆ చీకటిని తన వాక్యపు వెలుగులో పటాపంచలు చేసి దేవుడు సర్వసృష్టిని చేసాడు. మళ్ళీ సాతానుగాడు ప్రవేశించి ఆదాము అవ్వల మనోనేత్రాలను అంధకారమయం చేసాడు. అప్పటినుండి లోకంలో ఆధ్యాత్మిక చీకటి అలుముకుంది. అయితే యేసు ప్రభువు నిజమైన వెలుగుగా ఈ లోకంలోనికి వచ్చి ప్రతి మనుష్యుని వెలిగిస్తూ నూతన సృష్టి చేయడం ఆరంభించాడు.

నేటి పాత నిబంధన పాఠంలో ప్రవక్తయైన యెషయా దర్శనంలో అంధకారమయమయిన భూమి మీద యెహోవా మహిమ సీయోను ద్వారా ప్రకాశించడం చూస్తాడు. ఈ దర్శనం యేసు ప్రభువులో నెరేరుట యోహాను సువార్తలో చూస్తాం. ఎందుకంటే మనుష్యులందరిని వెలిగించు నిజమైన వెలుగుగా యేసు ఈలోకంలోనికి వచ్చాడు అని తెలియజేసాడు యోహాను (యోహాను 1:9). ఆయన ఎక్కడికి వెళ్తే అక్కడ మరణపు చీకటి పటాపంచలయింది (మత్త 4:12-16). యేసు ప్రభువు పరమునకు చేర్చబడకమునుపు సాతాను కలుగజేయు చీకటిని తనతో కలిసి పారద్రోలగల శిష్యులను యేసుసిద్ధపరచుట నేటి సువార్త పాఠంలోచూస్తాం. లోకంలో నిరంతరం సాతాను కలుగజేయు చీకటిని పారద్రోలు పనిని యేసుతో కలిసి చేసే శిష్యులు ఏ విధంగా క్రీస్తు వెలుగులో నడుచుకోవాలో నేటి పత్రిక పాఠంలో చూస్తాం.

**పాత నిబంధన పాఠం: యెష 60:1-7; భూమి దేవుని ప్రభావ మహిమతో నిండును**

బైబిలు ప్రకారం, దేవునికి దూరం అవడమే మరణం. దీనినే నరకము లేదా వెలుపటి చీకటి అని నూతన నిబంధనలో చూస్తాం (మత్త 22:13). పాపముచేయు ప్రతివారికి ఇదే గతి. అయితే అందరు పాపం చేయుటవలన అందరూ నరకానికి పోవలసినవారే. అయితే ఎవ్వరు ఈ విధంగా నశించిపోవుట దేవునికిష్టం లేదు (యెహె 18:23,32). అందుకే ఎన్నిసార్లు తన ప్రజలైన ఇశ్రాయేలు ప్రజలు పాపం చేసినప్పటికి వారిని దేవుడు నిత్యమరణానికి అప్పగించలేదు. ప్రవక్తలను పదే పదే పంపిస్తూ వారు మారుమనస్సు పొందుటకు దేవుడు అవకాశం ఇస్తూనే వచ్చుట ప్రవక్తల గ్రంథాలలో చూస్తాం. అలా మారుమనస్సు పొందువారికి కలుగబోవు ఆశీర్వాదాలను నేడు ప్రవక్త దర్శనంలో చూస్తాం. దేవుని ప్రజలు, అనగా సంఘం, తమ క్రియల విషయంలో మారుమనస్సు పొందితే (యెష 59:20), దేవుడు మళ్ళీ వారితో నిబంధన చేసి, తన మహిమను వారిపై ప్రకాశింపజేస్తాననంటున్నాడు. భూమిని కమ్మిన చీకటిని, జనములను కమ్మిన కటిక చీకటిని పారద్రోలునట్లు నీతి సూర్యునివలె యెహోవా దేవుడు ఉదయించి చెదరిన వారినందరిని సమకూర్చుతానని వాగ్దానం చేస్తున్నాడు. వారు వచ్చేటప్పుడు బంగారు ధూప ద్రవ్యములను తెస్తూ యెహోవా స్తోత్రములను ప్రకటిస్తారని ప్రవక్త ప్రవచించాడు. ఈ ప్రవచనాలన్ని యేసులో నెరవేరాయి. ఆయన నిజమైన వెలుగుగా ఈలోకంలో ఉదయించినప్పుడు జ్ఞానులు బంగారం, ధూపద్రవ్యాలు తీసుకొని ఆయనను ఆరాధించారు. ఆ తరువాత అనేకమంది వారి మార్గాన్ని అనుసరించి ఆయనను ఆరాధించారు. ఆయనకు వారి జీవితాలర్పించారు. ఆ విధంగా తమ జీవితాలర్పించిన తన శిష్యులను లోకానికి వెలుగై లోకంలోని చీకటిని పారద్రోలు పరిచర్యకై యేసు వారిని సిద్ధపరిచాడు. అదే నేటి సువార్త పాఠం.

**సువార్త పాఠం: లూకా 24:13-35; ప్రతివారిని వెలిగించు నిజమైన వెలుగు యేసు ప్రభువు**

సువార్తలన్నీ యేసు ప్రభువు తన శిష్యులను లోకంలోనికి తన ప్రతినిధులుగా పంపించి లోకంలో చీకటిని పారద్రోలు పరిచర్య కొరకు ఏ విధంగా సిద్ధపరచారో తెలియజేస్తాయి. తన పిలుపు విని తనను వెంబడించిన వారందరి ఆత్మ దీపాలను వాక్యముతో వెలిగించి, వారి హృదయాలను మండించి, లోకంలో అలుముకున్న పాపపు చీకటిని పారద్రోలు దీపాలుగా తండ్రి తనను ఈ లోకంలోనికి ఏ విధంగా పంపాడో ఆ విధంగానే నేడు యేసు తన శిష్యులను పంపుతున్నాడు (యోహాను 3:17, 17:17-19). వీరిలో ఎమ్మాయి మార్గములో యేసు కలుసుకొనిన ఇద్దరూ కూడా ఉన్నారు. వారి మనోనేత్రాలను ఏ విధంగా వెలిగించి, తనను గూర్చి లేఖనాలు ఏమి తెలియజేస్తున్నాయో వారికి బోధించారో, అదేవిధంగా తనను వెంబడించు ప్రతి శిష్యునికి చేసి వారు వెళ్ళి అనేకమందిని శిష్యులుగా చేసే పరిచర్యకు యేసు వారిని లోకంలోనికి పంపిస్తాడు. పౌలును కూడా అందుకే ప్రభువు ఏర్పాటు చేసుకున్నాడు. అ తరువాత పౌలు ఆకసమునుండి కలిగిన ఆ దర్శనమునకు నేను అవిధేయుడనుగాక సమస్త జనులు దేవుని తట్టు తిరిగి మారుమనస్సునకు తగిన క్రియలు చేయవలెనని ప్రకటించాను అంటాడు. (అ.కా. 20:19,20). ఆ విధంగా తాను క్రీస్తు యేసు బానిసనంటూ, ఆయన వలన పొందిన పరిచర్యను తుదముట్టించుటకు తన ప్రాణమును కూడ ప్రియమైనదిగా ఎంచుకొనక, క్రీస్తు కొరకు త్యాగం చేసాడు. మూడు సువార్త దండయాత్రలు చేసి ఐరోపా ఖండమంతా, అనేకమందిని శిష్యులనుగాచేసి అనేక సంఘాలను స్థాపించాడు. ఆ సంఘాల కొరకు నిరంతరం ప్రార్థన చేస్తూ వీలైతే మళ్ళీ మళ్ళీ వాళ్లను దర్శించాడు. వీలుగాకపోతే ఉత్తరాలు ద్వారా వారు ఏం చేయాలో బోధిస్తూ, అందరిని తనవలె చేయమని సవాలు చేసాడు. చెరసాలలో వేయబడ్డా తన తోటి ఖైదీలకు సువార్త చెప్పి వాళ్ళను శిష్యులుగా చేసాడు. చెరసాలలో నుండి వ్రాయబడిన పత్రికలే ఎఫెసి, ఫిలిప్పి, కొలస్సీ మరియు ఫిలేమోను. ఏ విధంగానైనా అందరిని రక్షించి, అందరిని క్రీస్తునందు సంపూర్ణులుగా చేసి దేవుని ఎదుట నిలువబెట్టుటకు పోరాడాడు. ప్రయాసపడ్డాడు. ఎఫెసీ సంఘస్తులకు సంఘమంటే ఏమిటో తెలియజేస్తూ, సమయము పోనియ్యక శిష్యులనుగా చేసే పరిచర్య చేస్తూ లోకంలో క్రీస్తు వెలుగులోనడుచుకోమంటున్న పౌలు ద్వారా అందరిని అదే చేయమంటున్నాడు దేవుడు నేటి పత్రిక పాఠంలో.

**పత్రిక పాఠం: ఎఫెసి 5:8-21; ప్రభువు మన వెలుగు ప్రకాశింపనియ్యమంటున్నాడు**

తమ పాపములొప్పుకొని యేసును తమ స్వంత రక్షకునిగా అంగీకరించని వారందరు పాపము చీకటిలో ఉండడమే గాకుండా వారు చీకటియై యున్నారు. అయితే యేసును అంగీకరించినపుడు, వారి మనోనేత్రములు వెలిగించబడతాయి. వారి హృదయాలలో మహిమా స్వరూపుడైన సత్య దేవుని జ్ఞానోదయం అవుతుంది. అప్పుడు వారు క్రీస్తునందు వెలుగవుతారు. ఒకప్పుడు అవినీతిపరులు, ఇప్పుడు నీతిమంతులు. ఒకప్పుడు అబద్ధికులు ఇప్పుడు సత్యవంతులు అవుతారు. ఈ విధంగా వెలుగు సంబంధులైన వారిక అంధకార క్రియలలో పాలివారుగా ఉండరు. వాటిని చేయువారిని ఖండిస్తారు. ప్రభువుకేది ప్రీతికరమో దానిని అనగా ఆయన చిత్తాన్ని వాక్యము ద్వారా పరీక్షించుచు, ఆ విధముగా నడుచుకొనుటయే వెలుగులో నడుచుకొనుట అంటే.

ఆ విధంగా ప్రతి ఒక్కరిని దేవుడు నడువమంటున్నాడు ఈ రోజు. ఎందుకంటే దినములు బాగా లేవు. గనుక ప్రతివారిని టి.వి చూస్తూ సమయం పోనియద్దంటున్నాడు. టి.వి. చూడడానికి ఉపయోగించే సమయాన్ని వాక్యములో దేవునిచిత్తాన్ని పరీక్షించి తెలిసికొనుటకు ఉపయోగించమంటున్నాడు. ఇక రక్షణ జ్ఞానము లేకుండా బుద్ధిహీనులుగా ఉండొద్దంటున్నాడు. పాపమను చీకటిలో పండుకొనక మరణనిద్ర నుండి మేల్కోమంటున్నాడు. అప్పుడు క్రీస్తు రక్షణ వెలుగు ప్రతి ఒక్కరిపై ప్రకాశిస్తుంది. అలా తిరిగి జన్మించి, వాక్యమను పాలనాపేక్షిస్తూ క్రీస్తు మాటలను హృదయమందుంచుకొంటూ ఆత్మపూర్ణులై ఉండమంటున్నాడు. త్రాగుడు మానమంటున్నాడు.

క్రీస్తునందు భయముతో ఒకనికొకడు లోబడుచు, కీర్తనలతోను సంగీతములతోను ఆత్మ సంబంధమైన పాటలతోను హెచ్చరించుకొనుచు ప్రభువైన యేసుక్రీస్తు పేరట, తండ్రియైన దేవునికి సమస్తమును గూర్చి ఎల్లప్పుడు కృతజ్ఞతాస్తుతులు చెల్లించమంటున్నాడు. ఆయన పనికై జీవితాలర్పించి లోకంలో ఉన్న చీకటిని పారద్రోలమంటున్నాడు. ఎవరైతే జీవవాక్యమును చేత పట్టుకుంటారో, అనేకమందిని నీతి మార్గములోనికి త్రిప్పుతారో వారు మూర్ఖమైన వక్రమైన ఈ లోకంలో క్రీస్తు జ్యోతులుగా నిరంతరం ప్రకాశిస్తారు. ఆ విధంగా ప్రకాశించడానికి చావు నిద్ర నుండి లేవండి. ప్రభువైన యేసును అంగీకరించండి. ఆయనను వెంబడిస్తూ వెళ్ళి ఈ లోకంలోనున్న చీకటిని పారద్రోలండి అని ఈ రోజు పరిశుద్ధాత్మ దేవుడు మనందరికి పిలుపునిస్తున్నాడు. మరి మీరేమంటారు?

**జీవితానికి అన్వయం - ఈ వార ధ్యాన సూచనలు**

**సోమవారం :** సామె. 20:27 ధ్యానించండి. మీ ఆత్మ దీపం వెలుగుతుందా? ఆరిపోయిందా? ఈ రోజే వెలిగించుకొండి. లూకా 18:35-43.

**మంగళవారం :** ఫిలిప్పి 2:12-18 ధ్యానించండి. జీవవాక్యమును చేతబట్టుకోవడం అంటే వాక్యమును వినుట (రోమా 10:17) చదువుట (ద్వి.కా. 17:14-21, యెష 34:18). అధ్యయనం చేయుట (2 తిమో. 2:15). కంఠత చేయుట (సామె. 7:1-2) ధ్యానించుట (యెహో. 1:8).

**బుధవారం :** యెషయా 58:1-14, మన విశ్వాస జీవిత దీపాలు ఎప్పుడు వెలుగుతుండాలంటే ఏమి చేయాలి?

**గురువారం :** దానియేలు 12:1-3. క్రీస్తు కొరకు ఎల్లప్పుడు ప్రకాశించే నక్షత్రంగా ఉండాలంటే మనమేమి చేయాలి

**శుక్రవారం :** మత్తయి 5:16 ధ్యానించండి. లోకానికి మనం వెలుగుగా ఉండాలంటే ఏమి చేయాలి.

**శనివారం :** ఎఫెసి 2:10 ధ్యానించండి. దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలే విధంగా చేయగలం. 2 తిమో. 3:16, తీతు 3:8, 3:14.

20-04-08

## యేసే మార్గము, జీవము, సత్యము

**(సామె 4:10-19, 2 పేతు 1:3-11, యోహాను 14:1-7, కీర్తన 32:1-9, 20-32)**

### స్తుతి ఆరాధన : కీర్తన 32:1-9, 20-32

యెహోవాయే సమస్తాన్ని తన వాక్కు ద్వారా సృష్టించాడు. ఆయనే కృపగలవాడు. గనుక మనము ఇంకా నశించిపోకుండా ఉన్నాము. ఆరాధనంటే ఆయన మన సృష్టికర్త అని గ్రహించి ఆయనయందు భయభక్తులు కలిగి ఉండడమే ! నిత్యము ఆయనను స్తుతించడమే. గనుక ఆయన పరిశుద్ధ నామమందు నమ్మికయుంచి ఆయనకొరకు కనిపెట్టుకొనిన వారందరు ఆయన యందు సంతోషిస్తారు. నిత్యము ఆయనను కొనియాడుతారు. నూతన గీతములతో, స్వరమండలములతో స్తుతిస్తారు. ఆనందగీతములు పాడతారు. ఆ గుంపులో మీరున్నారా?

### సందేశము

“మతి ఉద్భవం మతం” అనగా మతినుండి పుట్టినది మతం. మతం అనగా అభిప్రాయం, ఉద్దేశం అని అర్థం. ఎవరి మతికి సమ్మతమైనది వారి మతం. అయితే క్రైస్తవ్యం మతం కాదు. అది మార్గం. పరలోకానికి ఏకైక మార్గము. ఆ మార్గం యేసే. మరి వేరే మార్గములేదు. “మరి ఎవని వలన రక్షణ కలుగదు. ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన ఏ నామమున రక్షణ పొందలేము (అ.కా. 4:12). ఏ రోజైతే ఆదాము, అవ్వ దేవుని ఆజ్ఞ మీరి సాతాను మాట విన్నారో ఆ రోజు మానవులు దారి తప్పారు. “అందరును త్రోవ తప్పి పనికిమాలినవారైయ్యారు (రోమా 3:12). అపరాధము చేసి చచ్చిన వారయ్యారు (ఎఫెసీ 2:1,2). పాపము చేసి పాపమునకు, సాతానుకు అనగా అసత్యానికి దాసులయ్యారు (యోహా. 8:34).

ఈ స్థితిలో నున్న మానవులను పరలోకమునకు తీసికొనిపోవుటకు యేసు ప్రభువు ఈ లోకానికి వచ్చాడు. అదే నేటి సువార్త పాఠం. యేసు మార్గమే దేవుని మార్గము, జ్ఞాన మార్గం, యథార్థ మార్గం, జీవ మార్గం, వెలుగు మార్గం. అదే నేటి పాత నిబంధన పాఠం. ఈ మార్గములో పరలోక ప్రయాణం కొనసాగించడం అంటే ఏమో నేటి పత్రిక పాఠం బోధించుచున్నది.

### సువార్త పాఠం: యోహాను 14:1-7; యేసే పరలోక మార్గం

బైబిలులోని అతి ముఖ్య వచనం యోహాను సువార్తలో ఉన్నది. అది యోహాను 3:16. దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను, కాగా తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడు నశింపక నిత్యజీవము పొందుటకు ఆయనను అనుగ్రహించెను. నలుగురు సువార్తికులు ఇశ్రాయేలు ప్రజలు ఎదురుచూస్తున్న మెస్సీయా యేసుప్రభువే అని తెలియజేసి, ఆయనయందు ప్రతివారు విశ్వాసముంచి నిత్యజీవమును పొందాలన్న భారంతో వ్రాసారు. యెహోవా తండ్రి, కుమారుడైన యేసు, పరిశుద్ధాత్మ ఒక్కరే అన్న త్రిత్వ సిద్ధాంతం కూడా ఈ సువార్తలో యోహాను తేటగా బయలుపరుస్తాడు. యేసుప్రభువు “నేనే మెస్సీయా (4:25) జీవాహారము నేనే (6:25) నేను లోకమునకు వెలుగును (9:5), గొఱ్ఱెలపోవు ద్వారము నేనే (10:7), నేను పునరుత్థానము (11:25), నేనే మార్గము, జీవము, సత్యము (14:7), నేను నిజమైన ద్రాక్షావల్లిని (15:1)” అని అన్నప్పుడు “నేను ఉన్నవాడను” అను నామాన్ని ఆయనకు ఆపాదించుకుంటునట్లు మరియు ఆయన, తండ్రి ఏకమై యున్నారని మనం గ్రహించాలి. అంటే యేసు దేవుడు, తండ్రికున్న లక్షణాలన్ని ఆయనకున్నాయి అని మనం తెలుసుకోవాలి. మానవాళిగొఱ్ఱెలవలే, త్రోవతప్పి, నివాసపురమేది దొరుకక, అరణ్యమందు, యెడారి త్రోవను తిరుగాడుచుండగా వారికి నివాసపురమును, అనగా పరలోక పురమును చేరునట్లు చక్కని త్రోవను (కీర్త 107:4,5) నడిపించుటకు మంచి గొఱ్ఱెల కాపరిగా తన గొఱ్ఱెల కొరకు ప్రాణము పెట్టుటకు వచ్చాడు. ఈ విధంగా యేసు పరలోకానికి చేరు మార్గమై యున్నాడు.

పాపము చేసి పాపమునకు, సాతానుకు దాసులై జీవితకాలమంతయు మరణభయముచే దాస్యమునకు లోబడినవారిని విడిపించుటకు ఆయన రక్తమాంసములలో పాలివాడయ్యాడు (హెబ్రీ 2:14-15). దీనినే యోహాను, ఆ వాక్యము శరీరధారియై మన మధ్య నివసించెను అంటాడు (యోహా. 1:14). ఈ విధంగా కుమారుడు వాక్యమై అనగా సత్యమై (యోహా. 17:17), ఆ సత్యముద్వారా మనలను స్వతంత్రులనుగా చేయుటకు వచ్చాడు. అందుకే యేసు మనలను విమోచించు సత్యమై యున్నాడు (యోహా. 18:31-33, 36).

పాపము వలన వచ్చు జీతము మరణము (రోమా 6:23a). మనుష్యులందరు పాపము చేసినందున మరణము అందరికి వచ్చింది (రోమా 5:12). అయితే యేసు సిలువలో దేవునికృప వలన ప్రతి మనుష్యుని కొరకు మరణము అనుభవించి (హెబ్రీ 2:10) ఆ ప్రకారం మరణము యొక్క బలము గలవానిని అనగా అపవాదిని మరణము ద్వారా నశింపజేసి, (హెబ్రీ 2:13) మనలనందర్ని నిత్య జీవానికి వారసులనుగాచేసాడు. అందుకే దేవుని కృపావరము మన ప్రభువైన యేసునందు నిత్య జీవము (రోమా 6:23b). కనుక యేసే మనకు జీవమై యున్నాడు. ప్రభువా, ప్రభువా అంటే ఎవ్వరూ పరలోకానికి వెళ్ళరు. తండ్రిచిత్తమైన కుమారుని చూచి, అనగా మనో నేత్రాలతో ఆయన మన కొరకు సిలువలో చేసిన దానిని గ్రహించి ఆయనయందు విశ్వాసముంచి నిత్యజీవము పొందుట ద్వారానే ఎవరైనా పరలోకానికి వెళ్ళగలరు. దీనినే పరలోక జ్ఞానము, లేదా రక్షణ జ్ఞానము అని బైబిలు తెలియజేస్తుంది. నేటి పాత నిబంధన పాఠంలో ఉన్న నీతిమంతుల మార్గమంటే కూడా ఇదే.

**పాత నిబంధన పాఠం: సామె. 4:11-14; పరలోక మార్గం పరిశుద్ధ మార్గం**

ఎవరైతే దేవుని వాక్యమైన యేసేను అంగీకరిస్తారో, అంటే దేవుని మాట విని ఆయనను అంగీకరిస్తారో వారికి ఇక మరణం లేదు. వారు దీర్ఘాయుష్మంతులు, ఎవరైతే యేసును అంగీకరింపరో వారు చేసే దానిలో మంచి ఉండనే ఉండదు. ఎదుటివారికి కీడు చేయకుండా నిద్రపోరు. ఎందుకంటే పాపమునకు లోనైన వారు చేసేవి ఈలాంటి క్రియలే అని వాక్యము తెలియజేయుచున్నది (కీర్త 17:1-9, రోమా 3:10-18). ఎందుకంటే వారి ఆత్మ దీపము ఆరిపోయింది కనుక వారు చీకటి అయ్యారు. చీకటి క్రియలనే చేస్తారు. భక్తి హీనుల మార్గము చీకటిమయం. వారు దేనిమీద పడతారో వారికే తెలియదు. యేసును అంగీకరించినపుడు, మన మనోనేత్రాలు పట్టపగలగు వరకు వేకువ వెలుగు తేజరిల్లునట్లు వెలిగించబడతాయి. మునుపు చీకటి అయిన మనం ఇప్పుడు క్రీస్తునందు వెలుగవుతాం. మనలను క్రీస్తు నీతిమంతులుగా తీరుస్తాడు. ఆ నీతిని పొందిన మనం ఆయనచెప్పినట్లు నీతి కొరకు ఆకలి దప్పులు గలిగి ఆయన మార్గములో నడుచునప్పుడు, మన మార్గము అంతకంతకు తేజరిల్లుతుంది. అయితే ఇలా ప్రయాణం చేస్తున్న మనం మన విశ్వాస జీవితాలకు అమర్చుకోవలసినవి అమర్చుకోక పోతే, అంటే మన రక్షణను భయముతో వణుకుతో కొనసాగించకపోతే మళ్ళీ మన జీవితాలు చీకటిమయం అయ్యే ప్రమాదం ఉంది సుమా అని పేతురు నేటి పత్రిక పాఠంలో హెచ్చరిస్తున్నాడు.

**పత్రిక పాఠం: 2 పేతు 1:1-11; మీరు పరలోక మార్గంలో ఉన్నారా? దారి తప్పారా?**

పాపం చేయుట వలన కంటికి శుక్లం సోకినట్లు మన మనోనేత్రాలకు అంధత్వం వస్తుంది. యేసును అంగీకరించగానే శుక్లాన్ని ఆపరేషన్ చేసినప్పుడు ఆ రోగికి ఎలా చూపు వస్తుందో అలాగే మన మనోనేత్రాలు వెలిగించబడతాయి. సాధారణంగా శుక్లం ఆపరేషన్ చేసి కంటిలో (IOL) అనే కటకం వేసాక, మొదట వారికి చాలా బాగా కనిపిస్తుంది. కాని ఆ తరువాత చాలమందికి మళ్ళి మసక వస్తుంది. ఎందుకంటే, వేసిన ఆ కటకం పై పొర ఏర్పడుతుంది. కంటి డాక్టర్లు లేజర్ కాంతికిరణాలను కంటిలోనికి పంపించి పొరను తీసివేస్తారు. వెంటనే చూపు మళ్ళీ వస్తుంది. అదే విధంగా మన విశ్వాసమునకు సద్గుణము, జ్ఞానము, ఆశానిగ్రహము, సహనము, భక్తి, సహోదర ప్రేమ, మరియు దయను (అగాపే ప్రేమను) అమర్చుకోకపోతే, మళ్ళీ ఆధ్యాత్మిక అంధత్వం వచ్చే ప్రమాదం ఉందని పేతురు హెచ్చరిస్తున్నాడు. ఎప్పుడైతే సరిగా కనిపించడం లేదో, మనం దారి తప్పుతాం. సాతానుగాడు చేసే పని ఇదే. మొదట మనలను టి.వి. చూపించి గ్రుడ్డి వాళ్ళను చేసి వదిలేస్తాడు. అంతే మనం దారి తప్పి తిరుగుతుంటాం (2 కొరింథి 4:4). ఈ పరిస్థితి రాకముందే, మనం సోమరితనం వీడి మన విశ్వాసమునకు పైన చెప్పబడిన ఏడు లక్షణాలను అమర్చుకుంటూ, యేసువైపు చూస్తూ పరలోక యాత్ర కొనసాగించినపుడు, మన ప్రభువు యొక్క పరలోక రాజ్యంలో సమృద్ధియైన ప్రవేశం అనుగ్రహింపబడుతుంది. భళానమ్మకమైన మంచి దాసుడా అని ప్రభువు మనలను ఆహ్వానిస్తాడు. మరి ఈ రోజు మీకు లేజర్ అవసరమేమో? వాక్యము లేజర్ కాంతికంటె శక్తివంతమైనది. మీరు దారిలో ఉన్నారా? దారి తప్పారా? యేసును అంగీకరించి, ఆయనను వెంబడించుటకు ఇంకా తీర్మానం చేయకపోతే, మీరు దారిలో లేనట్లే. లోకం వెళ్ళే విశాల మార్గములో ఉన్నారు. అది తిన్నగా నరకానికే మిమ్ములను తీసుకువెళ్తుంది. నేడే యేసు పిలుపు విని ఆయనను వెంబడించుటకు తీర్మానము చేయండి. దేవుడు మీకు సహాయం చేయునుగాక !

**జీవితానికి అన్వయం - ఈ వార ధ్యాన సూచనలు**

**సోమవారం :** యిర్మీ 6:16-21 ధ్యానించండి. ఇశ్రాయేలు ప్రజలు దేవుని మాట వినక చాలమంది నశించిపోయారు గాని దేవుడు కృప చూపిస్తూ ప్రవక్తలను పంపిస్తూ మారు మనస్సు పొందుటకు అవకాశమిస్తూనే వచ్చాడు. నేడు మనకు కూడా అనేక అవకాశములిచ్చు చున్నాడు.

**మంగళవారం :** సామె 22:6 ధ్యానించండి. బాలుడు నడువవలసిన త్రోవ ఎవరు నేర్పాలి. తల్లితండ్రులు నేర్పాలి. మరి నేర్పడానికి మీకు ఆ త్రోవ తెలుసా? ద్వి.కా. 6,7 చదవండి. ఈ విషయం ఏం చేస్తారో నేడు ఆలోచించండి.

**బుధవారం :** 1 సమూయేలు 12:20-25. ధ్యానించండి. శ్రేష్ఠమైన చక్కని మార్గమేది.

**గురువారం :** యెషయా 35:8 ధ్యానించండి. దారిగానున్న రాజమార్గమేది? యేసేసుమా!

**శుక్రవారం :** లూకా. 9:1-9. ధ్యానించండి. రెండవ వచనంలో ఉన్న ఈ మార్గమేది. అ.కా. 18:26, 24:14-16 ధ్యానించండి.

**శనివారం :** కీర్తన 119:105-112 ధ్యానించండి. 105 వచనాన్ని కంఠత చేయండి.

27-04-08

## సువార్త ప్రచారోద్యమం కొరకు వినూత్నపరచుట

### (యెష 1:10-17, కీర్తన 113, యాకోబు 1:19-27, మత్త 25:31-46)

### స్తుతి ఆరాధన : కీర్తన 113

యెహోవాయే నిజమైన దేవుడు. ఆయనకు అసాధ్యమైనదేదియు లేదు. ఆయన సర్వసృష్టి కర్త. ఆయనను పోలినవారెవరు లేరు. మహోన్నతుడు అయినను విరిగి నలిగిన వారి యొద్ద నివాసము చేయువాడు. దరిద్రులను లేవనెత్తును. బీదలను పైకెత్తును. మనలను ధనవంతులను చేయుటకు ఆయన దరిద్రుడాయెను. అట్టి దేవుని కృపనెరిగిన వారు ఎల్లప్పుడు ఆయనను సన్నుతించాలి. ఆయన నామమును కొనియాడాలి. సంతానప్రాప్తి నొసగువాడు ఆయనే. కనుక ఆయనను ఎల్లప్పుడు స్తుతించాలి, ఆరాధించాలి.

### సందేశము

ఈ మధ్య ఒక సహోదరిని మీరేం చేస్తుంటారు అని నా భార్య అడగగా, ఆమె సేవ చేస్తుంటాను అన్నది. ఎలా చేస్తారు అని అడిగింది నా భార్య. నేను ప్రార్థన చేసి వారికి ఏమి సంభవిస్తోందో చెబుతాను. వారు నాకు డబ్బులు ఇస్తారు అన్నది. ఆమె చేసే పని సేవ అని ఆమెకున్న వరం ప్రవచన వరం అని ఆమె అభిప్రాయం. ఈమె వలే చాలమంది సేవకులు వారు ఏమి చేస్తే అదే సేవ అనుకుంటారు. మరికొందరు సందర్భాన్ని పట్టించుకోకుండా బైబిలులోని ఒక వచనం తీసుకొని ఒక ఉద్యమాన్ని ప్రారంభిస్తుంటారు. ఇలాటి సేవకులు అనేకమంది ఉన్నారు ఈ రోజులలో. “దేవుని యందు భయభక్తులు కలిగి ఆయన కట్టడలననుసరించి నడుచుచుండవలెను మానవకోటి ఇదియే విధి” అని మహా జ్ఞాని సొలోమోను జీవితాన్ని అన్ని కోణాలలో పరిశీలించి, అనుభవించి పరిశోధించి, అన్నాడు ప్రసంగిలో. (ప్రసంగి 12:13). మొత్తం బైబిలు మానవకోటికి దేవుని కట్టడ లేదా ఆజ్ఞ అని అనవచ్చు. దేవుని ఆజ్ఞ నిత్యజీవం అన్నాడు యేసు ప్రభువు ( యోహాను 12:50).

**నిత్య జీవం** అనబడిన దేవుని ఆజ్ఞను మూడు ఆజ్ఞలుగా విభజించవచ్చు.

1. ఇప్పుడైతే దేవుడు అంతటను అందరును మారు మనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు (అ.కా. 17:32). 2. ప్రయాసపడి భారము మోసుకొనుచున్న సమస్త జనులారా నాయొద్దకు రండి. నేను మీకు విశ్రాంతి కలుగజేస్తాను. నేను సాత్వికుడను దీన మనస్సు గలవాడను గనుక మీ మీద నా కాడి యెత్తుకొని నా యొద్ద నేర్చుకొనుడి (మత్త 11:20,23). 3. మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. తండ్రియొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడా ఉన్నానని వారితో చెప్పెను (మత్త 28:19,20). కనుక మనం దేవునిసేవ చేసేటప్పుడు ఈ మూడు ఆజ్ఞలను పాటించకుండా మనకు తోచినది చేస్తే ఇది సేవ అంటారా?

ఈ లోకంలో ఆయన సేవ చేయడానికే దేవుడు మనలనుంచాడు. అందరం పరిశుద్ధ దేవుని కుమారులమే. అనగా రాజులైన యాజకులమే. అందరం ఆయన గుణాతిశయములను ప్రచురించాల్సిందే. ఒక్కమాటలో చెప్పాలంటే “లోకము తనకుమారుని ద్వారా రక్షణ పొందుటకు దేవుడు పంపించాడు. ఆ కుమారుడైన యేసు అదే పని నిమిత్తము మనలనందరిని లోకములోనికి పంపించాడు” (యోహాను 3:17, 17:18). సువార్త ప్రచారోద్యమం అంటే ఇదే అని మనం గ్రహించాలి. అయితే చాలమంది జనాలు మారుమనస్సు పొందే విధంగా సువార్త ప్రకటించడమే అనుకుంటారు. మరికొందరు అవసరంలో ఉన్న వారిని ఆదుకొనడమే అంటారు. మరి కొందరు అయితే స్వస్థతే అనుకుంటారు. సువార్త ప్రచారోద్యమంలో ఇవన్నీ సమపాళ్ళలో ఉన్నాయని దేవుడు ఈ రోజు మనకు జ్ఞాపకం చేస్తున్నాడు, సువార్త, పత్రిక పాఠాల ద్వారా. ఈ పనిలో పాల్గొనకుండా, ఏదో గుడికి వచ్చి వెళ్లి పోయేవారికి అది భక్తి కాదని, ఆ విషయంలో మారు మనస్సు పొంది సువార్త ఉద్యమంలో పాల్గొనమంటున్నాడు దేవుడు నేటి పాత నిబంధన పాఠంలో. ఆత్మ సంఘములతో చెప్పు మాట చెవి గలవాడు వినుగాక ! ఆయన మాట వినని వారికి నరకమే గతి అని మరియొక సారి హెచ్చరిస్తున్నాడు.

### సువార్త పాఠం: మత్తయి 25:31-48;
### క్రీస్తు నామంలో ఏది చేసినా ఆయన అంగీకరిస్తాడు

దేవుని పని చేసే పనివాడు జీతమునకు పాత్రుడు. కనుక ప్రతివారికి దేవుడు తప్పక జీతమిస్తాడు అని ఈ ఉపమానం తెలియజేయుచున్నది. ప్రభువు తన వారిని ఎరిగియున్నాడు. ఆ రోజు గొల్లవాడు మేకలలోనుండి గొఱ్ఱెలను వేరుపరచునట్లు ఆయన వేరుపరుస్తాడు. నిజంగా సేవ చేసినవారికి సన్మానం, చేయనివారికి అవమానం తప్పదు.

మనకు తారసపడే ప్రతివారిని యేసువలే చూడడం, అది మనవల్ల గాదు. అయితే ఆయనను వెంబడిస్తే ఆయన మనలను ఆ విధంగా చేసేవారిగా చేస్తాడు. ఆకలిగొనిన వారికి భోజనం పెట్టండి, దప్పిగొనినవారికి నీళ్ళివ్వండి, పరదేశులను ఇంట చేర్చుకోండి, దిగంబరులకు బట్టలివ్వండి. చెరసాలలో ఉన్నవారిని పరామర్శించండి, అన్న యేసు మాటలను గురించి మనం ఏమనుకుంటున్నామో అది మన క్రియలలో కనిపిస్తుంది. కనుక ఈ ఉపమానం ప్రతిరోజు మనం చేయగల దయగల పనులను వర్ణిస్తుంది. ఈ క్రియలు

మనకున్న ఆస్తి మీదగాని, తెలివిమీదగాని, సామర్థ్యంమీద గాని ఆధారపడవు. ఇట్టే చేయగలం. ఇట్టే పొందగలం. ఇవి చేయకుండా ఉండడానికి మన దగ్గర సంజాయిషీ ఏమి ఉండదు. ఇతరుల అవసరాలను తీర్చుట, ఇది సంఘం, లేదా ప్రభుత్వం పని అంటూ మన బాధ్యతను తప్పించుకోలేమని యేసు ఈ రోజు మనకు జ్ఞాపకం చేస్తున్నాడు. కనుక ఈ రోజు దేవుని మాట వింటే దాని ప్రకారం చేసి ధన్యులవ్వమంటున్నాడు దేవుడు నేటి పత్రిక పాఠంలో.

### పత్రిక పాఠం: యాకోబు 1:19-27; మొదట ఆయన మాట వినమంటున్నాడు !

అబ్బ ! ప్రసంగం చాలా బాగుంది లేదా ఏం చెబుతాడండి ఈయన ! అంటూ గుడినుండి బయటకు వస్తుంటాం. దేవుడు మనలను ప్రసంగాలకు మార్కులివ్వమనడం లేదు. ఆయన మాట ప్రకారం, అనగా రక్షించుటకు శక్తిగల ఆయన వాక్యమును సాత్వికంతో అంగీకరించి, దాని ప్రకారం నడుచుకోమంటున్నాడు. అలా నడచుకోకపోతే మనలను మోసపుచ్చుకుంటాం, గనుక అలా మోసపోవద్దని హెచ్చరిస్తున్నాడు దేవుడీరోజు. దేవుని వాక్యం అద్దంలాంటిది. అది స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణ నియమం. నీ ముక్కు మీద మసి ఉందే అంటే తుడిచేయమ్మ! అన్నట్లున్నారు చాలమంది ఈ రోజులలో.

దేవునిచేత ఆశీర్వదించబడాలంటే ఆయన చెప్పింది చేయాలి. ప్రసంగం వినేటప్పుడు మనతో మాటలాడేవాడు దేవుడే సుమా ! కావున మనము వినిన సంగతులను విడిచిపెట్టి, కొట్టుకొనిపోకుండునట్లు వాటియందు మరి విశేష జాగ్రత్త కలిగి ఉండాలి (హెబ్రీ 2:1,2). దేవుని వాక్యములో తేరిచూస్తు, విన్న వాక్యమును మరిచిపోకుండా, దాని ప్రకారం నడచు వారందరు దేవునిచేత ఆశీర్వదింపబడతారు లేదా మోసపోతారు. తప్పకుండా ప్రతి ఆదివారం గుడికి రావడం చందాలివ్వడం మంచిదే. కాని అది భక్తి అనుకొని సరిపెట్టుకోకూడదు. నిజమైన లేదా నిష్కళంకమైన భక్తి అంటే దిక్కు లేని విధవరాండ్రను, వారి ఇబ్బందిలో పరామర్శించుట, మరియు దేవుని అమూల్య వాక్య వాగ్దానముల ద్వారా లోకమందున్న భ్రష్టత్వాన్ని తప్పించుకొని, దేవ స్వభావంలో పాలివారమగుట అని గ్రహించాలి. ఈ విషయం పట్టించుకోకుండా గుడిలో కూర్చొని, వెళ్ళిపోతే లాభం లేదు అని దేవుడు హెచ్చరిస్తున్నాడు నేటి పాత నిబంధన పాఠంలో.

### పాత నిబంధన పాఠం: యెషయా 1:10-17; మన పాపాలను విడిచిపెట్టమంటున్నాడు

దేవుడు మన నుండి ఆశించేది ఒకటే ఒకటి. ఆయన మాట వినడం. అది లేకుండా మనం ఏది చేసినా, ఎన్ని మేకలు, పొట్టేళ్ళు, క్రొవ్విన దూడలను బలులుగా అర్పించినా అవి ఆయనకు సంతోషాన్నివ్వలేవు. ఏదో ఆయన సన్నిధిలో కనబడాలని ఆయన మనలను ఆలయమునకు రమ్మనడం లేదు. మనం బహుగా ప్రార్థన చేసినా ఆయన వినడు. మన పండుగలు, ఆయనకు అసహ్యం, అవి ఆయనకు బాధాకరములు. ఆయన మొదట మననుండి ఆశించునది, మన పాపములశుద్ధి. మన దుష్క్రియలను విడిచి పెట్టడమే. దేవుడు న్యాయము జరిగించమంటున్నాడు. హింసించబడుతున్నవారిని విడిపించమంటున్నాడు. విధవరాళ్ళకు న్యాయము తీర్చమంటున్నాడు. ఇవేమి పట్టించుకోకుండా కానుకలు, అర్పణలు అర్పించడం వ్యర్థము అని మరియొకసారి జ్ఞాపకం చేస్తున్నాడు. ఆయన కోరేది విరిగి నలిగిన హృదయం, నలిగిన మనస్సే ఆయనకిష్టమైన బలి. కనుక మన పాపములను విడిచిపెట్టి ఉత్తమమును అనుకూలమును, సంపూర్ణమైన దేవుని చిత్తాన్ని ఆయన వాక్యంలో కనుగొంటూ, దిన దినము రూపాంతరపరచబడుతున్న జీవితాలను, సజీవయుగంగా సమర్పించి, ఆయన సేవ చేద్దాం. రండి ఆయన పిలుపువిని ఆయనను వెంబడిద్దాం ! మరి మీరేమంటారు. దేవుడు మన కన్నులు తెరచును గాక !

**జీవితానికి అన్వయం - ఈ వార ధ్యాన సూచనలు**

**సోమవారం :** మత్తయి 7:15-29 ధ్యానించండి. ప్రవచించడం, దయ్యములను వెళ్ళగొట్టడం కంటే ఏదియు ముఖ్యమైనదని యేసు ఇక్కడ బోధించుచున్నాడు.

**మంగళవారం :** మత్తయి 28:19,20 ధ్యానించండి. శిష్యులను చేయడం అంటే ఏమిటి? యేసు ప్రభువు శిష్యుడు అనే పదాన్ని ఐదుచోట్ల నిర్వచించాడు. ఆ వచనాలేవనగా యోహా 8:31, లూకా 9:23, 14:27, యోహాను 13:34, యోహాను 15:8, లూకా 6:40.

**బుధవారం :** యోహాను 8:31 ధ్యానించండి. వాక్యమునందు నిలిచి ఉండడం అంటే ఏమిటి? రోమా 10:17, యెష 34:16, 2 తిమో 2:15, సామె 7:1,2, యెహోషువా 1:8 చదివి వ్రాయండి.

**గురువారం :** లూకా 9:23, 14:27 ధ్యానించండి. అనుదినం సిలువ నెత్తుకొని వెంబడించడం అంటే గలతి 2:20,22, 5:24, 6:14 వచనాలు చదివి వ్రాయండి.

**శుక్రవారం :** యోహాను 13:34, 5:8 ధ్యానించండి. మనం ఫలించాల్సిన ఫలాలేవి. రోమా 6:22, సామె. 11:30 చదివి వ్రాయండి.

**శనివారం :** లూకా 6:40 ధ్యానించండి. క్రీస్తు రూపంలోనికి రూపాంతరపరచబడడమే శిష్యుని గురి. అదెలా సాధ్యం. రోమా 12:1,2; 2 కొరింథీ 3:18 చదివి వ్రాయండి.

## లేఖనాల దృశ్యరూపకాలు

### లేఖనాలను అర్థం చేసుకొనుటకు సహాయపడే చిహ్నాలు

బైబిలును మనం చదివేటప్పుడు నీరు, రొట్టె, నేల, విత్తనము మున్నగు పదాలను కనుగొంటాము. ఆ మాటలను విన్న వెంటనే మన మనస్సులో వాటి రూపం కదలాడుతుంది. దృశ్యరూపకాలు మన మనస్సులో ముద్రించబడి చాలకాలం పాటు గుర్తుంటాయి. అందుకే బైబిలును గ్రహించాలన్నా, గుర్తుంచుకోవాలన్నా ఈ చిహ్నాలను గమనించాలి.

ఈ రోజు మనం బైబిలులో వున్న దైవప్రేరణ చిహ్నాలు ఏవో కనుగొని పరీక్షించుకుంటూ, పరిశుద్ధ లేఖనాలను గ్రహించుటకు ప్రయత్నిద్దాం.

### 1. అద్దం (Mirror)

**లేఖన భాగం : (యాకోబు 1:23-35)**

దేవుని వాక్యం మానవ హృదయాంతరములో ఏముందో బయలుపరుస్తుంది. మన ఉద్వేగాలను, ఆలోచనలను పసికడుతుంది. మనమేమై ఉన్నామో, అలాగు మనమెందుకున్నామో, మనకు బయలుపరచిన దానిబట్టి మనమేమి చేయాలో బైబిలు మనకు బయలుపరచుతుంది. అద్దం మనమెలా ఉన్నామో అలాగే చూపిస్తుంది. కేవలం మన ప్రతిబింబాన్ని చూపిస్తుంది. అలా చేసిన తరువాత, జుట్టు చెదరినట్లుంటే దువ్వుకుంటాము, ముఖం చెమటతో మురికిగా ఉంటే కడుక్కుంటాం, గడ్డం పెరిగినట్లుంటే క్షౌరం చేసుకుంటాము. అలా అద్దంలో చూసుకున్న ప్రతిసారి చక్కగా ముస్తాబవుటకు ప్రయత్నిస్తాము. అలాగే దేవుని వాక్యంలోని మనం చూసినప్పుడు, మనలోని లోపాలను ప్రతిబింబింపజేస్తుంది. అంతేకాదు, సరిచేసికొనుటకు కూడా సహకరిస్తుంది.

2 కొరింథీ 3:18 కూడా దేవుని వాక్యం అద్దంలాంటిదని చెబుతుంది. "మనమందరము ముసుకులేని ముఖములో ప్రభువు యొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు, మహిమ నుండి అధిక మహిమను పొందుచూ ప్రభునకు ఆత్మచేత ఆలోలికగానే మార్చబడుచున్నాము".

లేఖనాలలో ప్రభువు మహిమను మన ప్రతిబించిప చేస్తున్నప్పుడు ఆత్మ దేవుడు మనలోని లోపాలను సవరించి, క్రీస్తు స్వరూపంలోనికి క్రమక్రమంగా మారుటకు క్రియ చేస్తూ ఉంటాడు.

అందానికి మెరుగు దిద్దుకునేందుకు కావాలి అద్దం
అద్దంలో చూసే వికారం కాదు అబద్ధం
లోపాలను చూపిస్తూనే సవరించుకొనుటకు సహాయపడుతుంది
దేవుని వాక్యం కూడా పాపివని చూపిస్తుంది
ప్రాయశ్చిత్తంగా క్రీస్తు సిలును చూపిస్తుంది
ఒప్పుకోమని మారుమనస్సు పొందమని రక్షణ
మార్గాన్ని, ఎదురుగా నిలుపుతుంది.

కాబట్టి వికారంగా ఉన్నానని, మురికిగా ఉన్నానని పారిపోక వాక్యపు అద్దంలో ఒక్కసారి చూసుకో, అసహ్యం వేసే బహు అపురూప సుందర దృశ్యం మారుయంది. ఇది సువార్త పాఠం జీవిత పరమార్థం.

పరిశుద్ధాత్ముడే మన మేకప్ మ్యాన్.

### 2. ఖడ్గం (Sword)

**లేఖన భాగం : (ఎఫెసి 6:17, హెబ్రీ 4:12)**

ఖడ్గం పదునైన ఆయుధం. యుద్ధానికి సన్నద్ధులైన వారందరు తప్పక కలిగి ఉండాల్సిన ఆయుధం ఖడ్గం. అలాగే క్రైస్తవ విశ్వాస పోరాటంలో ప్రతి విశ్వాసి కలిగి ఉండాల్సిన ఖడ్గం దేవుని వాక్యమనే ఖడ్గం, అతని ఖడ్గం.

ఆదినుండి దేవుని వాక్యాన్ని ప్రశ్నించేలా చేయుటే సాతాను పన్నాగం. "....దేవుడు చెప్పెనా"? (ఆది 3:1) అని హవ్వ మనస్సులో సందేహబీజాన్ని నాటాడు. దేవుని సరళమైన వాక్కును సందేహించడం మొదలుపెడితే సాతాను మాటకు లోబడి ఉచ్చులో ఇరుక్కుపోయినట్లే.

యేసుక్రీస్తు కూడా శోధింపబడినప్పుడు సాతాను దేవుని వాక్యాన్ని వక్రంలో వాడినప్పుడు, దేవుని వాక్యంచే ఎదురుదాడికి దిగి వాడు పారిపోయేలా చేశాడు. శత్రువు బైబిలును మనకంటె బాగా తెలుసుకొని ఉంటాడని మనం ఎరగాలి అందుకే వాదనలో కాలం వృథా చేయకూడదు.

"........దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్లను

మూలుగను విభజించునంతమట్టుకు చూచునా, హృదయము యొక్క తలంపులను ఆలోచనలను ఆరాధించుచున్నది" హెబ్రీ 4:12. శస్త్ర చికిత్స చేయు పదునైన కత్తి Open Heart Surgery చేసేది. ప్రోత్సహించే, ప్రేరేపించే వాక్యాలు గల గ్రంథాలు ఎన్నో వున్నాయి గాని జీవమిచ్చే వాక్కులు గల గ్రంథం బైబిలు. యోహాను 6:63 – "నేను మీతో చెప్పి వున్న మాటలు ఆత్మీయు జీవములై యున్నవి"

దేవుని వాక్యంలోనే సత్యమైన ఆయుధంచే మనం శత్రువులను ఓడించగలం. ఆయన వాక్కులో జీవముంది, శక్తి వుంది జయముంది, ఆయన వాక్కు వ్యర్థంగా తిరిగి రాదని యెహోవా 55:11 చెబుతుంది. "... నా నోటనుండి వచ్చు వచనమును ఉండును. నిషఫలముగా నీ యొద్దకు మరలక, అదినాకు అనుకూలమైన దానిని నెరవేర్చును. నేను పండిన కార్యమును సఫలము చేయును".

సాతాను మోసాన్ని జయించేది, బాధకాలము తెచ్చేది స్వేచ్ఛను ఇచ్చేది. దేవుని ఆత్మ ఖడ్గము, దేవుని వాక్యం. ఈ ఖడ్గాన్ని బైబిలును ఎప్పుడూ నీ దగ్గర ఉంచుకొనుట ఎంతో ఆవశ్యకము. నీ ఒరకు ఒక బైబిలును సంపాదించుకొని నీలో ఎప్పటికి ఉంచుకొనరిలీము. నిరంతరం జరిగే పోరాటంలో విజయం నీదే !

### 3. నీరు (Water)

**లేఖన భాగం : (ఎఫెసి 6:26)**

నీరు శుభ్రపరిచే ద్రావకం. అంతేకాదు జీవజలం కూడా. మనకు నీరు ఉపకరిస్తుంది. మన అనుదిన జీవితంలో నీటి ప్రాముఖ్యత ఎంతో మనందరికి తెలుసు. అంట్లు తోముటకు, బట్టలు ఉతుకుటకు, స్నానం చేయుటకు, వంటకు, త్రాగుటకు, వ్యవసానికి ఈ విధంగా నీతి ప్రయోజనాలు అన్ని ఇన్ని కావు.

దేవుని వాక్యం నీటితో పోల్చబడింది. దేవుని వాక్యం నీరు ఎలాగు బాహ్య శరీరాన్ని శుభ్ర పరుస్తుందో అలాగే మన అంతరంగాన్ని శుభ్రం చేస్తుంది. కడుగుతుంది. ఉదకస్నానం చేసిస్తుంది. యేసుక్రీస్తు కొరకు నవవధువుగా మాలను సిద్ధపరుస్తుంది (ప్రకటన 1:5; తీతు 2:14).

యోహాను 15:3లో ప్రభువంటాడు – "నేను మీతో చెప్పు మాటను బట్టి మీరిప్పుడు పవిత్రుడై యున్నారు". శరీర శుభ్రతకు క్రమమైన స్నానం ఎంత అవసరమో ఆ విధంగా శుభ్రతకు అనుదినం లేఖనాల సాక్ష్యం అవసరం ఉంది. పాపపు మురికిని, దోషపు మరకను, అపవిత్రత మచ్చను తొలగించేది దేవుని వాక్యమనే నీరు. దేవుని బిడ్డలకు వాక్యపు నీటి కొరత అసలే లేదు. అందులోనూ, ఉచితంగా లభిస్తుంది.

### 4. గంగాళం (Laver)

**లేఖన భాగం : (నిర్గమ 30:17-20)**

పాత నిబంధనలో ప్రత్యక్షగుడారంలో ఒక పెద్ద ఇత్తడి గంగాళం ఉండేది. సొలోమోను దేవాలయములో 8,000 వేల గాలన్ల నీరు పట్టేంత పెద్ద గంగాళం. సుమారు 15 అడుగుల వైశాల్యంలో కలిగి ఉండేది. యాజకులు కాళ్ళు కడుకునేందుకు సిద్ధం చేసేవారు. "ప్రభుత్వ గుడారమునకు బలిపీఠమునకు నడుమ దానిని ఉంచి నీళ్లతో నింపవలెను" (నిర్గమ 30:17).

.... తాము చావకుండునట్లు నీళ్లతో కడుక్కొవలెను (20వ). ఆవరణంలో గంగాళాన్ని ఉంచేవారు. ఆరాధన స్థలంలోకి అనగా పరిశుద్ధ స్థలంలోకి వెళ్లకముందు గంగాళంలోని నీటితో కాళ్లు కడుక్కొని వెళబ్బాలి. యాజకులు ప్రభువుని సేవించక ముందు కాళ్లను చేతులను ఈ నీటితోనే కడుక్కొవాలి. ప్రతిసారి కడుక్కొవాలి. కాబట్టి, మనకు కూడా ఇత్తడి గంగాళం అనే వాక్యం అవసరముంది. అలా శుభ్రం చేసికొనని యాజకులకు తీవ్రమైన శిక్ష విధింపబడేది. అలాగే మనం కూడా నిర్లక్ష్యం చేస్తే దేవుని ఉగ్రతకు గురి కావలసి వస్తుంది (నిర్గమ 30:20).

మన అనుదిన జీవితంలో గంగాళం ఎంతో ముఖ్యమైనది. మరీ సేవకులుగా పిలువబడేవారు. దేవుని సేవించేవారు, దేవుని వాక్యమనే గంగాళమనే నీళ్లలో కాళ్లను, చేతులను కడుక్కొని శుద్ధి చేయబడి, క్షమించబడి సేవకు పూనుకోవాలి. అట్టి సేవ దేవునికి ఇష్టమైనది.

### 5. విత్తనం (Seed)

**లేఖన భాగం : 1 పేతురు 1:23**

దేవుని రాజ్య సువార్త సందేశమే విత్తనము. దేవుని వాక్యమే విత్తనం అని యేసు పేర్కొన్నాడు (లూకా 8:5-15). వాక్యాన్ని ప్రకటించుట న్యాయం మనం విత్తనాన్ని విత్తవచ్చును. నీరు కట్టవచ్చును, పెంచవచ్చును గాని దేవుడు మాత్రమే వృద్ధి చేయగలడు. రక్షణ జీవాన్ని ఇవ్వగలడు (1 కొరి. 3:6-7). సమస్త కల్మషమును, విఱ్ఱవీగుచున్న దుష్టత్వమును మాని, లోపల నింపబడి మీ ఆత్మాలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి" (యాకోబు 1:27).

సమస్త కల్మషమును అను పదానికి క్రమములో వాడబడిన పదం 'రూపారియా' అనగా చెవిలో పేర్కొనిపోయే గువిలి (wax) అనగా

దేవుని వాక్యాన్ని వినకుండా నీ చెవులను మూసివేయగల waxను తీసివేసుకొనుము అని హెచ్చరిస్తోంది వాక్యం. చెవిగలవాడు వినును గాక ! (మత్తయి 15:15).

సాత్వీకములో అంగీకరించుడి – అనగా దేవుని వాక్యాన్ని మన హృదయంలో నాటబడే విధంగా స్వీకరించాలి. వాక్యం ఫలించుటకుచదును చేయబడిన, దున్నబడిన హృదయం అనే నేలను మనం సిద్ధం చేసిపోవలెను. కలుప మొక్కలు పెరగకుండా చూసుకోవాలి. వాక్య విరోధమైన సున్నతులను ఎదురించాలి. సాత్వీకం అనగా బలహీనము కాదు "meckruss is not weakness" నియంత్రణలో ఉన్న శక్తిని లేదా బలాన్ని సాత్వీకం అంటాము.

## 6. అగ్ని (Fire)
### లేఖన భాగం : యిర్మీయా 23:29

అగ్ని శుద్ధి చేస్తుంది, రగిలింపజేస్తుంది, (బలపరుస్తుంది) గట్టి పరుస్తుంది.

A) **దేవుని వాక్యం శుద్ధీకరిస్తుంది –** పాపాన్ని ఒప్పింపజేసి, పవిత్రత కొరకైన ఆశను రేకెత్తిస్తుంది. దేవుని వాక్యం దహించు అగ్ని, మన జీవితంలోని పొట్టును కాల్చి వేస్తుంది. బైబిలు నన్ను పాపానికి దూరంగానౌనా ఉంచుతుంది లేదా పాపం బైబిలును దూరంగానైనా ఉంచుతుంది. నీ హృదయంలో వాక్యాన్ని దాచుకోవాలి అప్పుడు పాపం చేయకుండా నిన్ను సంరక్షిస్తుంది.

B) **దేవుని వాక్యం అగ్నిలా రగిలింపజేస్తుంది –** దేవుని వాక్యం మా హృదయంలో ఉంటే అది మనలను రగిలింపజేసి, ఇతరులకు అంటించేలా ప్రోద్భల పెడుతుంది. కృంగిన ప్రాణాన్ని లేవదీస్తుంది. పశ్చాత్తాపానికి నడిపిస్తుంది. దేవుని పరిచ్యకై పునరంకితం చేసికొనేలా చేస్తుంది. ఆయన ప్రజల హృదయాలను పరిచర్య జ్వాలను రగిలింపజేస్తుంది ఆయన వాక్యం.

C) **గట్టిపరుస్తుంది –** ఇనుప పనిముట్టు అగ్నిచేత దృఢంగా మార్చబడుతాయి. ఆయన వాక్యపు అగ్ని మనలను గట్టి పరిచేలా దేవుడు వాడుకుంటాడు. తన విశ్వాసాన్ని ఒప్పుకోలును బలపరుస్తుంది.

## 7. దీపము, వెలుగు (A Lamp and Light)
### "నీ వాక్యము నా పాదములకు దీపమును, నా మార్గముకు వెలుగై యున్నది"
### లేఖన భాగం : కీర్తనలు 119:105

పాపంచే అంధకారమయమైన ఈ లోకంలో వెలుగు కిరణాలు వెదజల్లితే ఎంత బాగుంటుంది. దేవుని వాక్య వెలుగైయుండి, పరిస్థితులలో, వ్యక్తులలో ప్రకాశాన్ని తెస్తుంది.

"నీ వాక్యము వెల్లడి అగుట తోడనే వెలుగు కలుగును అది తెలివి లేని వారికి తెలివి కలిగించును" కీర్తనలు 119:130.

"జీవము మనుష్యులకు వెలుగై యుండెను. ఆ వెలుగు చీకటిలో ప్రకాశించుచున్నది కాని చీకటి దాని గ్రహిపకుండెను" యోహాను 1:45.

దీపము తక్కువ పరిధిలో వెలుగు నింపగలుగుతుంది. అడుగు వేస్తూ ముందుకు వెళ్తున్నకొద్ది దీపం మనతో వస్తూ తన వెలుగును ప్రసరింపజేస్తుంటుంది. వెలుగు మార్గమంతటిని ప్రకాశమానం చేస్తుంది. వేగంగా వెళ్లుటకు, ముందు చూపుతో వ్యవహరించుటకు సహాయపడుతుంది.

## 8. సుత్తె (Hammer)
### లేఖన భాగం : యిర్మీయా 23:29

సుత్తె వంటిది కాదా? నా మాట అగ్ని వంటిది కాదా? బండను బద్దలు చేయు దేవుని వాక్యంలో అద్భుతమైన శక్తి వుంది. పగలగొట్ట గలిగిన, కట్ట కలిగిన శక్తి ఉంది. సుత్తె రెండు విధాలుగా వినియోగించబడుతుంది. ఒకటి పగులకొట్టుటకు, రెండోది కట్టుటకు. కఠిన హృదయాలను బద్దలు కొడుతుంది. దేవుని వాక్యము దేవుని వాక్యం శాపాన్ని ఆశీర్వాదముగా మార్చగలదు. బిలామును ఇశ్రాయేలీయులను శపించుటకు మోయాబు రాజు ఏర్పాటు చేసినా, దేవుడు ఆ శాపమును ఆశీర్వాదముగా చేసెను (ద్వితి. 23:5). అలాగే హేతువు లేని శాపము తగలక పోవును (సామెతలు 26:2). తప్పుడు సిద్ధాంతాలతో కూడిన అబద్ధాలను కూడా దేవుని వాక్యం కొట్టి వేయును. మోసంయొక్క శక్తిని నాశనం చేసే దేవుని సుత్తె దేవుని వాక్యం. వ్యాధులు, బాధలు అనే బంధకాలను తెగ నరికేది దేవుని వాక్యం అనే సుత్తె. మనలను కట్టుటకు, తయారు చేయుటకు, దేవుడు వాక్యమనే సుత్తెను వాడతాడు. దేవుడు ఎల్యాకీమును గురించి చెబుతూ – "దిట్టమైన చోట మేకు కొట్టినట్లు నేను అతని స్థిరపరచెదను (యెష 22:23).

తగిన ఆకారంలో మనలను తయారు చేయుటకు దేవుడు సుత్తెలాంటి వాక్యాన్ని వాడతాడు. వాక్యంచే క్రీస్తులో మనం అనుదినం కట్టబడుతూ ఉన్నాము.

## 9. ఆహారము (Food)

**లేఖన భాగం : యిర్మీయా 15:16**

"నీ మాటలు నాకు దొరకగా నేను వాటిని భుజించితిని,... నీ మాటలు నాకు సంతోషమును నా హృదయమునకు ఆనందమును కలుగజేయుచున్నవి" (యిర్మీయా 15:16).

ఆహారము శరీరానికి ఎంత అవసరమో అలాగే దేవుని వాక్యమనే ఆహారం అవసరం ఎదుగుదలకు, పుష్టికి సమతుల ఆహారం కావాలి. పోషకాహారలోపం వలన శరీరంలో ఎన్ని ఇబ్బందులు ఎదురవుతాయో ఆధ్యాత్మిక ఆరోగ్యానికి ఆధ్యాత్మిక ఆహారం అత్యవసరం. లేఖనంలో పేర్కొనబడిన నాలుగురకాల ఆహారాలను చూద్దాం.

**A) పాలు (Milk)**

"…. క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై నిర్మలమైన వాక్యమను పాలవలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము, ఆ పాలను అపేక్షించుడి" (1 పేతు. 2:2).

పాలను అపేక్షించుట అనగా ఆకలికలిగి వుండుట. ఆధ్యాత్మికంగా క్రొత్తగా జన్మించిన శిశువు వలె దేవుని వాక్యమను పాలకై తాపత్రయపడాలి. పాలకై ఏడ్వని శిశువుకు ఏదో జబ్బు ఉండి ఉంటుంది. ఆకలి లేమీలు నా అవాంఛన లక్షణం. దేవుడు మన ఆధ్యాత్మిక ఆకలి తీర్చుటకు ఎల్లప్పుడు ఇష్టపడతాడు.

అలాగే క్రమంగా ఎదుగుటకు కూడా పాలను విరివిగా సేవించాల్సి ఉంది.

**B) ఘనాహారము (Meat)**

"వయస్సు వచ్చినవారు అభ్యాసము చేత మేలుకీడులను వివేచించుటకు సాధకము చేయబడిన జ్ఞానేంద్రియములు కలిగి యున్నారు. కనుక బలమైన ఆహారము వారికి తగును" (హెబ్రీ 5:14).

వినుటకు మందులైన వారు (11వ) వాక్యంచే పోషింపబడక ఆధ్యాత్మిక పోషకాహార లోపంతో బాధపడుతుంటారు. చిన్నప్పుడు పాలు త్రాగుతూ క్రమంగా ఘనాహారాన్ని అలవాటు చేసుకున్న పిల్లలు బాగా ఎదుగుతూ ఆరోగ్యంగా ఉంటారు. ఆరు మాసాల తరువాత మెల్ల మెల్లగా ఘనాహారాన్ని అలవాటు చేస్తారు. అదే విధంగా విశ్వాస జీవితంలో కూడా రక్షింపబడిన శిశువులు కొద్ది రోజులు పాలలాంటి తేలికగా జీర్ణమయ్యే (అర్ధమయ్యే) విశ్వాస సూత్రాలను నేర్చుకొని ఆ తరువాత క్రమంగా లోతైన విషయాలను నేర్చుకొనుటకు అలవరచుకొని ఇతరులకు తాము నేర్చుకున్న వాటిని బోధించుటకు మొదలు పెట్టాలి.

**C) రొట్టె (Bread)**

మనుష్యుడు రొట్టెవలన మాత్రము గాక దేవుని నోటినుండి వచ్చు మాటవలన జీవించును – మత్త 4:4. దేవుని వాక్యం రొట్టెవలె మన ఆధ్యాత్మిక ఆకలి తీర్చుటకు పోషణను, శక్తిని, ఆరోగ్యాన్ని అనుగ్రహిస్తుంది.

**D) తేనె (Honey)**

కీర్తన 119:103 – "నీ వాక్యము నా జిహ్వకు ఎంతో మధురములు. అవి నా నోటికి తేనెకంటె తీపిగా నున్నవి.
దేవుని మాటలు మాకు దొరికినప్పుడు తేనెలా జుర్రుకోవాలి అన్నంత మధురానుభూతి మనలో కలిగిస్తుంది. ఫలాలన్నిటికంటె మధురమైనది, తీపి గలది తేనే. అలాంటి తేనెకంటె తియ్యనిది దేవుని ఆదరణ వాక్కు.

**E) కొలబద్ద (Measuring Rod)**

"దేవుని వాక్యము…. హృదయము యొక్క తలంపులను ఆలోచలను శోధించుచున్నది" (హెబ్రీ 4:12).

సూటిగా దూరగలిగిన ఖడ్గంలాంటిది దేవుని వాక్యం. హృదయాలోచనలను పసిగట్టగలదు. ప్రాణాత్మల మధ్య వున్న బేధాన్ని తేలికగా స్పష్టం చేయగలదు. శరీరానుసారమైన మనస్సును కలిగి వున్నామా, ఆత్మానుసారమైన మనస్సును కలిగి వున్నామా అనే విషయాన్ని తేటగా తెలియజేయును. దేవుని వాక్యం ద్వారానే మనం ఒకరి వ్యక్తిత్వాన్ని కొలవగలం. అదే తగిన ప్రమాణము. మన ఉద్దేశాలను, అభిప్రాయాలను జీవన విలువలను స్థితిని కొలిచేది ప్రమాణీకరించేది దేవుని వాక్యమైనప్పుడు, మనం ఆయన చిత్త ప్రకారం జీవిస్తున్నామని ఋజువు పరుచును. అప్పుడు మనం ఇతరులకు మాదిరిగా ఉండి, దేవుని నామాన్ని మహిమ పరుస్తాము.

మన ఆధ్యాత్మిక ఎదుగుదలకు కొలబద్ద దేవుని వాక్యం. మన సత్యశీలతకు కొలబద్ద దేవుని వాక్యం. మన విశ్వాసానికి ప్రమాణం దేవుని వాక్యమే.

**– డా॥ దేవకుమార్ సరిపెల్లి**